
సాక్షి సూర్యాపేట

శుక్రవారం । 11 । ఏప్రిల్ । 2025



సద్దుమణిగిన అసమ్మతి

మదర్ డెయిరీ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టేం దుకు సిద్ధమైన సొంత పార్టీ డైరెక్టర్లు.. ఎమ్మెల్యే జోక్యంతో మెత్తబడ్డారు.

- 8లో



దొంగల అరెస్ట్

సెల్‌ఫోన్లు చోరీ చేస్తున్న ముగ్గురు దొంగలను గురువారం అరెస్ట్ చేసినట్లు సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్ తెలిపారు.

- 8లో



ట్రాక్టర్ బోల్తా

హుజూర్‌నగర్ మండలం గోపాలపురంలో గురువారం ధాన్యం లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడింది

- 8లో

న్యూస్‌రీల్

నేడు కోదాడ బార్ అసోసియేషన్ ఎన్నికలు

కోదాడరూరల్ : కోదాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడి ఎన్నిక దాదాపుగా ఏకగ్రీవమైనట్లే. అధ్యక్ష పదవికి న్యాయవాదులు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, నాళం రాజయ్యలు పోటీపడుతున్నారు. అయితే బార్ అసోసియేషన్ క్షేమం కోరి సీనియర్‌ల సలహా మేరకు నాళం రాజయ్య పోటీ నుంచి విరమించుకొని లక్ష్మీ నారాయణరెడ్డికే మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. దీంతో బార్ కౌన్సిల్ నియమావళి ప్రకారం ఎన్నిక జరగాల్సి ఉన్నప్పటికీ రాజయ్య పోటీనుంచి తప్పుకోవడంతో లక్ష్మీ నారాయణరెడ్డి ఎన్నిక దాదాపుగా ఖరారు అయింది. శుక్రవారం అధ్యక్ష పదవితో పాటు ఎగ్జిక్యూటివ్ మెంబర్ 4వ స్థానానికి ఎన్నికను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల అధికారి పాలేటి నాగేశ్వరరావు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలకు వరకు పోలింగ్ ఆ తర్వాత కౌంటింగ్ నిర్వహించి విజేతలను ప్రకటించనున్నారు. ఈ ఎన్నికల్లో 104 మంది న్యాయవాదులు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నట్లు నాగేశ్వరరావుతో పాటు సహాయ అధికారులు వెంకటేశ్వర్లు, రామకృష్ణ తెలిపారు.

ఉపాధి పనులను వాటర్ షెడ్ పద్ధతిలో గుర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

భానుపురి (సూర్యాపేట) : యుక్తధార పోర్టల్ ద్వారా ఉపాధి హామీ పనులను వాటర్ షెడ్ పద్ధతిలో గుర్తించాలని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. గురువారం సూర్యాపేట కలెక్టరేట్‌లో ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్, టెక్నికల్ అసిస్టెంట్లకు యుక్త ధార శిక్షణ తరగతుల్లో డీఆర్‌డీఓ వీవీ అప్పారావుతో కలిసి పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీలో వాటర్ షెడ్ పద్ధతిలో ఎత్తు పల్లాల నుంచి దిగువపల్లం వరకు సంబంధించిన పనులను పోర్టల్‌లో గుర్తించాలన్నారు.

సాగర్ కాల్వలకు నీటి నిలిపివేత

నాగార్జునసాగర్: సాగర్ కుడి, ఎడమ కాల్వలకు గురువారం సాయంత్రం నీటిని నిలిపివేశారు. యాసంగి పంటకుగాను అధికారులు గత సంవత్సరం డిసెంబర్ 15 నుంచి ఆయకట్టుకు ఏకధాటిగా నీటిని విడుదల చేశారు. కుడికాల్వ కింద ఏపీలో 10.50 లక్షల ఎకరాలు సాగైంది. ఎడమకాల్వ కింద ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 3,98,790 ఎకరాలు, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 2,63,736 ఎకరాల్లో వరి సాగైంది. ఈ సీజన్‌లో 115 రోజులపాటు కుడి కాల్వకు 100టీఎంసీలు, ఎడమ కాల్వకు 74టీఎంసీల నీటిని విడుదల చేశారు.

విద్యుత్‌లైన్ పునరుద్ధరణ పనులు పూర్తి చేయాలి

హుజూర్‌నగర్‌రూరల్ : విద్యుత్ లైన్ పునరుద్ధరణ పనులు త్వరగా పూర్తి చేయాలని ట్రాన్స్‌కో ఎస్‌ఈ ఫ్రాంక్లిన్ సిబ్బందిని ఆదేశించారు. హుజూర్‌నగర్ మండలంలోని వేపలసింగారంలో మంగళవారం అర్ధరాత్రి వీచిన ఈదురు గాలులకు సబ్‌స్టేషన్‌కి వచ్చే 33 కేవీ లైన్ విద్యుత్ స్తంభాలు ఎనిమిది విరిగిపోయాయి. కాగా గురువారం డీఈ వెంకటస్వామితో కలిసి విద్యుత్ లైన్ పునరుద్ధరణ పనులను పరిశీలించి మాట్లాడారు. వీరి వెంట ఏఈ రాం ప్రసాద్, సిబ్బంది తదితరులు ఉన్నారు.





నాగారం మండలం వర్ధమానుకోట గ్రామంలోని ఐకేపీ కేంద్రంలో తడిసిన ధాన్యం రాశులు

ధాన్యం వరదపాలు

నాగారం : నాగారం మండల పరిధిలో గురువారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఈ వర్షానికి వర్ధమానుకోట గ్రామంలోని రెండు ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో రైతుల ఆరబోసిన ధాన్యం తడిసిముద్దయ్యింది. అకాల వర్షానికి ధాన్యంపై పట్టాలు కప్పే సమయం కూడా లేదు. అలాగే ఇప్పటికే కొన్ని ధాన్యం రాశులపై కప్పిన పట్టాలు గాలికి కొట్టుకుపోయాయి. దీంతో ధాన్యం పూర్తిగా తడిసి పోయింది. నాగారం, నాగారంబంగ్లా, ఫణిగిరి, పస్తాల గ్రామాల్లో కొద్దిగా ధాన్యం తడిసింది. వరిచేలు నేలవాలాయి.

ఈదురు గాలులతో..

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండల పరిధిలో గురువారం రాత్రి భారీ ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లో కొంతమేర ధాన్యం తడిసింది.

అమ్ముకోం.. వండుకుంటం

సన్న బియ్యంపై లబ్ధిదారుల సంతృప్తి

- సరిగ్గా వండితే.. సాఫీగానే భోజనం
- కొన్నిరోజులు ఆగి వండుకుంటే మరింత బాగు
- గంజి సరిగ్గా వార్చకపోతే కాస్త ముద్దగా అన్నం
- కొంతమేర నూకలు.. అయినా బాగున్నాయని ఆనందం

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఉమ్మడి జిల్లాలో సన్న బియ్యం పంపిణీపై ప్రజల నుంచి ఆనందం వ్యక్తం అవుతోంది. సరిగ్గా వండుకుంటే సమస్యే లేదని లబ్ధిదారులు చెబుతున్నారు. గంజి సరైన సమయంలో సరిగ్గా వార్చకపోతే కొద్దిగా ముద్ద అవుతోందని, అయినా పర వాలేదని సన్న బియ్యం పంపిణీపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొత్త బియ్యం అయినందున కొన్నాళ్లు ఆగి వండుకుంటే మరింత బాగుంటుందని పేర్కొంటున్నారు. అక్కడక్కడ కొంతమేర నూకలు వస్తున్నా, దొడ్డు బియ్యంతో పోల్చితే సన్న బియ్యాన్ని పూర్తిగా వండుకొని తింటామని ప్రజలు చెబుతున్నారు. ఈ నెల మొదటి వారంలోనే సన్న బియ్యం సరఫరా అయ్యాయి. 90 నుంచి 60 శాతం మంది లబ్ధిదారులు బియ్యాన్ని ఇప్పటికే తీసుకెళ్లారు. తొలి మూడు, నాలుగు రోజులు లబ్ధిదారులు షాపుల వద్ద బారులు తీరారు. సన్న బియ్యం చింట్లు, హెచ్‌ఎంటీలు రకంగా పలువురు చెబుతున్నారు. ప్రస్తుతం పంపిణీ చేస్తున్నవి ఫోర్టిఫైడ్ సన్నబియ్యం అని చెబుతున్నారు. సన్న బియ్యంలో మూడు రకాల బియ్యం ఉన్నాయని, 30శాతం వరకు నూకలు, మెరిగెలు ఉన్నాయని లబ్ధిదారులు పేర్కొంటున్నారు. బియ్యం తీసుకున్న ప్రతి ఒక్కరూ వండుకుంటున్నారు ఎక్కడా అమ్ముకోవడం లేదు. బియ్యంలో సుమారు 15 నుంచి 20 శాతం వరకు నూకలు ఉన్నట్లు లబ్ధిదారులు తెలుపుతున్నారు. బియ్యం తినడానికి వీలుగా ఉన్నట్లు లబ్ధిదారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం అన్నం బాగానే ఉంటుందని గంజి వార్చితే ఇంకా బాగుంటుందని మహిళలు చెబుతున్నారు. ఇదివరకు దొడ్డు బియ్యం ఇస్తుండడంతో తాము పిండి పట్టించడానికి ఇతర అవసరాలకు వాడుకున్నామని, కానీ ఇప్పుడు ప్రభుత్వం ఇస్తున్న సన్న బియ్యంతో అన్నం వండుకొని తింటున్నట్లు పలువురు లబ్ధిదారులు పేర్కొంటున్నారు. సన్న బియ్యం తీసుకున్న ప్రజలు ఆ బియ్యంతో ఏం చేస్తున్నారు.. గతంలో దొడ్డు బియ్యాన్ని ఇడ్లీ, దోశలకు వినియోగించినట్లుగానే వినియోగిస్తున్నారా? వాటిలా అమ్ముకునేందుకు ఆలోచన చేస్తున్నారా? లేదంటే తినేందుకే ప్రాధాన్యం ఇస్తున్నారా? అనే అంశాలపై 'సాక్షి' గురువారం క్షేత్ర స్థాయిలో పరిశీలన జరిపింది. లబ్ధిదారులతో మాట్లాడింది. మొత్తానికి సన్న బియ్యంను తాము తినేందుకే వినియోగిస్తామని 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్‌లో ప్రజలు ముక్తకంఠంతో చెప్పుకొచ్చారు.



అన్నం బాగుందని చూపిస్తున్న భూదాన్ పోచంపల్లికి చెందిన లావణ్య



మాడ్గులపల్లి మండలం ఆగామోత్కూర్‌లోని రేషన్‌షాపులో సన్న బియ్యం తీసుకుంటున్న లబ్ధిదారులు

ఉమ్మడి జిల్లాలో సన్న బియ్యం సరఫరా ఇలా.. (కిలోలలో)

కేటగిరీ	నల్లగొండ	సూర్యాపేట	యాదాద్రి
రేషన్ షాపులు	997	610	515
కార్డులు	4,66,522	3,25,235	2,17,072
ప్రతి నెలా కోటా	89,70,855	50,00,000	36,00,000
ఈ నెల సరఫరా	89,70,855	60,42,000	42,00,000
ఇప్పటివరకు పంపిణీ	59,97,914	54,50,000	30,00,000.

పట్టణాల్లోని కొన్ని షాపుల్లో కొరత

పట్టణ ప్రాంతాల్లోని రేషన్ షాపుల్లో బియ్యం కొరత ఏర్పడింది. రేషన్‌కార్డుదారులు రాష్ట్రంలో ఎక్కడైనా బియ్యం తీసుకునే వెసులుబాటు ఉండటంతో గ్రామాల నుంచి, ఇతర ప్రదేశాల నుంచి పలు పనుల నిమిత్తం పట్టణాల్లో నివసిస్తుంటారు. అలాంటి వారు కూడా పట్టణంలోని షాపుల్లో సన్నబియ్యం తీసుకోవడంతో బియ్యం కొరత ఏర్పడింది.

ఇంకా కొనసాగుతున్న పంపిణీ



ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం రేషన్ షాపులు 2122 ఉండగా, వాటి పరిధిలో 10,08,829 రేషన్ కార్డులు ఉన్నాయి. ఆయా కార్డులపై ప్రతినెలా 1,75,70,855 కిలోల బియ్యాన్ని ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. ఈ నెలలో సన్న బియ్యం పంపిణీని ప్రారంభించింది. ఇందులో భాగంగా 1,92,12,855 కిలోల బియ్యాన్ని రేషన్ షాపులకు సరఫరా చేయగా, ఇప్పటివరకు 1,44,47,914 కిలోల బియ్యాన్ని ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసింది. ఇంకా 31.22.941 కిలోల బియ్యం పంపిణీ చేయాల్సి ఉంది.

పేదలకు మేలు



సన్నబియ్యం పంపిణీతో పేదలకు ఎంతో మేలు జరుగుతుంది. గతంలో దొడ్డుబియ్యం పంపిణీతో దళారులకు లబ్ధిచేకూరేది. ఆ బియ్యాన్ని తినలేక చాలా మంది అమ్ముకునేవారు. కోళ్లకు, గేదెలకు పెట్టేవారు. ఇప్పుడు ప్రతిఒక్కరూ ఈ బియ్యాన్నే తింటారు.

- గంపల కిష్టమ్మ, నెమ్మికల్లు, ఆత్మకూర్(ఎస్) మండలం

సన్నబియ్యం పర్వాలేదు



గతంలో ఇచ్చిన దొడ్డు రకం బియ్యం కంటే ప్రస్తుతం రేషన్ దుకాణంలో ఇస్తున్న సన్న బియ్యం పర్వాలేదు. అన్నం కొద్దిగా మెత్తగా అవుతోంది. గతంలో ఉన్న బియ్యం తినలేకపోయాం. నాకు నెలకు ఆరు కిలోలు వస్తాయి. సన్నబియ్యం నిరంతరం ఇస్తే బాగుంటుంది.

- కిన్నెర రాములమ్మ, తిప్పర్తి



హుజూర్‌నగర్‌లోని రేషన్‌షాపులో సన్నబియ్యం తీసుకుంటున్న మహిళలు

అన్నం బాగుంది..

మాకు రేషన్‌కార్డు ద్వారా 24 కిలోల సన్నబియ్యం వచ్చాయి. సన్నబియ్యాన్ని అన్నం వండుకొని తింటున్నాం. అన్నం విడివిడిగా బాగా ఉంది. కానీ, కాస్త చప్పగా అనిపిస్తుంది. సన్న బియ్యం పంపిణీతో మహిళలంతా సంతోషంగా ఉన్నారు.

-కె.లావణ్య, భూదాన్‌పోచంపల్లి

అన్నం ముద్దలుగా అవుతోంది



రేషన్ దుకాణంలో ఇస్తున్న సన్న బియ్యం వండితే అన్నం ముద్దలు, ముద్దలు అవుతోంది. తినడానికి ఇబ్బందిగా ఉంది. బియ్యంలో సగానికిపైగా నూకలు ఉన్నాయి. సన్న బియ్యం ఇవ్వడం సంతోషమే కానీ తినడానికి వీలుగా ఉండే బియ్యం ఇస్తే బాగుండు.

-సంపగంతి సత్తమ్మ, రావిగూడెం, మునుగోడు

సన్నబియ్యం అన్నమే తింటున్నాం



ఈసారి రేషన్ షాపులో సన్న బియ్యం ఇవ్వగా వాటినే మా ఇంట్లో వండుకున్నాం. అన్నం బాగానే ఉంది. కొంచెం నీళ్లు తక్కువగా పోస్తే అన్నం మెత్తగా కాకుండా ఉంటుంది. ఈ సన్నబియ్యం అన్నం రుచి బాగానే ఉంది. ప్రతినెలా సన్నబియ్యాన్ని దుకాణాలలో కొనుగోలు చేసే వాళ్లం. ఈసారి రేషన్ దుకాణంలో ఇవ్వడంతో బయట కొనడం తప్పింది.

- నల్లగుంట్ల రవికుమార్, కాసర్లపహాడ్, జాజిరెడ్డిగూడెం మండలం

బియ్యం బాగున్నాయి



గతంలో బియ్యం కోసం ప్రతి నెలా రూ.2వేలు ఖర్చు చేశాం. ప్రస్తుతం రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయడంతో మాకు ఆ డబ్బు మిగిలింది. బియ్యం బాగున్నాయి. అన్నం కూడా ఎంతో రుచిగా ఉంది. సన్న బియ్యంను మధ్యలో నిలిపివేయకుండా నిరంతరం సరఫరా చేయాలి

-జటంగి నర్సమ్మ, కేతేపల్లి

రూ.1500 ఆదా అయ్యాయి



ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్న బియ్యం బాగానే ఉన్నాయి. మా ఏరియా వారందరూ సన్న బియ్యం వండుకుని తింటున్నారు. ప్రభుత్వం సన్న బియ్యం ఉచితంగా ఇవ్వడం వల్ల మాకు బియ్యం కొనుగోలు చేయడం తప్పింది ఈ నెల దాదాపు రూ.1500 వరకు ఆదా అయ్యాయి. - రమ్య, హుజూర్‌నగర్

ధాన్యం కొనుగోళ్లు త్వరగా ప్రారంభించాలి



ధాన్యం పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు

చివ్వెంల(సూర్యాపేట) : ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను త్వరగా ప్రారంభించాలని జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు సూచించారు. గురువారం చివ్వెంల మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసి మాట్లాడారు. రైతులు ఆరబెట్టిన ధాన్యం తీసుకవచ్చి మద్దతు ధర పొందాలన్నారు. తేమశాతం 17 రాగానే సీరియల్ ప్రకారం తూకం వేయాలన్నారు. కాంటా వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లయ్ అధికారి రాజేశ్వర్, నిర్వాహకులు కృష్ణారెడ్డి, మహేందర్ పాల్గొన్నారు.

ఆరోగ్యమే లక్ష్యంగా 'పోషణ పక్షం'



కిశోర బాలికలు, మహిళలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

సూర్యాపేట అర్బన్ : కిశోర బాలికలు, గర్భిణుల ఆరోగ్యమే లక్ష్యంగా పోషణ పక్షం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు పేర్కొన్నారు. గురువారం సూర్యాపేట పట్టణంలోని అర్బన్ ప్రాజెక్ట్ బొడ్రాయి బజార్ సెక్టార్ లోగల 25 వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, మహిళలు, కిశోర బాలికలకు పరిశుభ్రత పైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ అధికారి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి సుబ్బలక్ష్మి, ఏసీడీపీఓ రూప, జిల్లా కోఆర్డినేటర్ కృష్ణయ్య, సెక్టార్ సూపర్‌వైజర్ గోనె నాగమణి , అంగన్‌వాడీ టీచర్లు అనిత, ఊర్మి, ఉమామహేశ్వరి పాల్గొన్నారు

వేసవి సెలవులకు ముందే బడిబాట

- పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడమే లక్ష్యం
- 23 వరకు కొనసాగనున్న కార్యక్రమం

సర్కారు బడి బలోపేతానికి..

సూర్యాపేటటౌన్ : సర్కారు బడి బలోపేతానికి కొందరు ఉపాధ్యాయులు నడుం బిగించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడమే లక్ష్యంగా వేసవి సెలవులకు ముందే వీరు స్వచ్ఛందంగా బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అధికారికంగా కాకపోయినప్పటికీ రెండు మూడు రోజుల్లో జిల్లా వ్యాప్తంగా నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఈ కార్యక్రమం ఈనెల 23 వరకు కొనసాగనుంది.

జిల్లాలో 950 ప్రభుత్వ పాఠశాలలు..

జిల్లాలో ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలు మొత్తం 950 ఉన్నాయి. వీటిలో 690 ప్రాథమిక, 70 ప్రాథమికోన్నత, 190 ప్రభుత్వ ఉన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో మొత్తం 70వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపే లక్ష్యంగా బడిబాట కార్యక్రమాన్ని ఏటా జూన్‌లో నిర్వహిస్తున్నారు. అయితే ఈ ఏడాది ముందస్తుగానే స్వచ్ఛందంగా ఉపాధ్యాయులు బడిబాట నిర్వహిస్తున్నారు.

ముందస్తుగానే విద్యార్థుల గుర్తింపు..

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన కొంత మంది ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కలిసి స్వచ్ఛందంగా ముందస్తుగా బడి బాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఒంటి పూట బడులు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని ఉదయం 7 నుంచి ఉదయం 8 గంటల మధ్య నిర్వహిస్తున్నారు. మరి కొన్ని పాఠశాలల్లో మధ్యాహ్నం 12.30 గంటల తర్వాత నిర్వహిస్తున్నారు. గ్రామంలో బడిబయట ఉన్న పిల్లలు, ప్రైవేటు పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, మోడల్ స్కూళ్లకు వెళ్లే విద్యార్థులను గుర్తించి స్థానికంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకోవాలని కోరుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సర్కారు కల్పిస్తున్న సౌకర్యాలు, డిజిటల్ తరగతులు గురించి పిల్లలతో పాటు వారి తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. గుర్తించిన పిల్లలను జూన్ మొదటి వారంలో లో నిర్వహించే అధికారిక బడిబాట కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో చేర్పుకోనున్నారు.

రెండు మూడు రోజుల్లో జిల్లా వ్యాప్తంగా..

ప్రతి సారి జూన్‌లో బడిబాట నిర్వహిస్తుండటంతో అప్పటికే విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల్లో అడ్మిషన్లు పొందుతున్నారు. ఈ విషయాన్ని కొంత మంది ప్రధానోపాధ్యాయులు కలెక్టర్ తేజస్‌నందలాల్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఈ సారి జిల్లాలో ముందస్తుగానే బడిబాట నిర్వహించి పాఠశాలలు ముగిసే సమయానికి జిల్లా అంతా బడిబాట నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. అయితే జిల్లాలో మరో రెండు మూడు రోజుల్లో అన్ని పాఠశాలల్లో బడిబాట నిర్వహించాలని ఆదేశాలు రానున్నట్లు అధికారులు తెలుపుతున్నారు.



నాగారం మండలం పసునూర్‌లో బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాలల్లోనే అన్ని వసతులు



జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తోంది. ప్రస్తుతం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత కూడా లేదు. నాణ్యమైన బోధన అందుతోంది. కార్పొరేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధన, డిజిటల్ తరగతులు, సౌకర్యాలు కల్పిస్తున్నాం. పేద విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదివి సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఆసక్తితో స్వచ్ఛందంగా వారే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

- అశోక్, డీఈఓ

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో శ్రీస్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అదే విదంగా నిత్యహోమం, మూలవిరాట్‌కు పంచా మృతాభిషేకం చేపట్టారు. కల్యాణతంతులో భాగంగా విశ్వక్సేనారాధన , పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, మధుపర్కపూజ, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీస్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో అర్చకులు, భక్తులు ఊరేగించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

క్లుప్తంగా

ధాన్యం లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా

- డ్రైవర్‌కు గాయాలు



ట్రాక్టర్ బోల్తా పడడంతో రోడ్డుపై పడిపోయిన ధాన్యం

హుజూర్‌నగర్‌రూరల్: ధాన్యం లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ఘటన హుజూర్‌నగర్ మండలం గోపాలపురం గ్రామంలో గురువారం జరిగింది. వివరాలు.. పాలకవీడు మండలం బొత్తలపాలెం గ్రామానికి చెందిన బోగాల సతీష్‌రెడ్డి ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. గురువారం గ్రామంలోని తన మామ శంభిరెడ్డికి చెందిన ట్రాక్టర్‌లో ధాన్యం లోడుతో హుజూర్‌నగర్‌లోని రైస్ మిల్లుకు వస్తున్నాడు. కాగా హుజూర్‌నగర్ మండలం గోపాలపురంలోని ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలోకి రాగానే ట్రాక్టర్ ట్రాలీ హైడ్రాలిక్‌ను చేయి తగలడంతో ట్రాలీ పైకి లేచి బోల్తా పడింది. దీంతో ధాన్యం మొత్తం మిర్యాలగూడ– హుజూర్‌నగర్ రహదారిపై పడడంతో కొద్దిసేపు ట్రాఫిక్ జాం అయ్యింది. ఈ ఘటనలో డ్రైవర్ సతీష్‌రెడ్డి స్వల్పంగా గాయపడ్డాడు.

కారు బోల్తా.. నలుగురికి గాయాలు



ప్రమాదానికి గురైన కారు

మునగాల: విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై మునగాల మండలం మొద్దులచెరువు గ్రామ స్టేజీ వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట నుంచి కోదాడ వైపు వెళ్తున్న కారు మునగాల మండలం మొద్దులచెరువు గ్రామ స్టేజీ వద్ద అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న నలుగురు వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని స్థానికులు 108 వాహనంలో కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల వివరాలు తెలియాల్సి ఉంది.

రైస్ మిల్లులో తనిఖీలు



మహాతేజ రైస్ మిల్లు వద్ద వేబ్రిడ్జిని తనిఖీ చేస్తున్న తూనికలు, కొలతల అధికారులు

మిర్యాలగూడ: వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామ పరిధిలోని మహాతేజ రైస్ మిల్లులో గురువారం జిల్లా తూనికలు, కొలతల అధికారి రామకృష్ణ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. వేబ్రిడ్జిలో పది టన్నుల ధాన్యంకు రూ.40కిలోల తేడా వస్తుండడం గుర్తించి వేబ్రిడ్జిని సీజ్ చేసి, రూ.1.25లక్షల జరిమానా విధించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అట్రాసిటి కేసులో జైలు శిక్ష, జరిమానా

అడ్డగూడూరు: అడ్డగూడూరు పోలీస్ స్టేషన్‌లో 2019లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు కాగా.. ఈ కేసులో అడ్డగూడూరు మండలం కంచనపల్లి గ్రామానికి చెందిన కుక్కునూరు సురేందర్‌రెడ్డి అలియాస్ విష్ణువర్ధన్‌రెడ్డి, బొడ్డుగూడేనికి చెందిన తీగల నర్సిరెడ్డికి ఆరు నెలలు జైలు శిక్ష, రూ.1000 చొప్పున జరిమానా విధిస్తూ గురువారం నల్లగొండ ఎస్సీ, ఎస్టీ స్పెషల్ కోర్టు జడ్జి తీర్పునిచ్చినట్లు అడ్డగూడూరు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

సద్దుమణిగిన 'మదర్ డెయిరీ' అసమ్మతి

- చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టేందుకు డైరెక్టర్ల ప్రయత్నం
- డైరెక్టర్లు, చైర్మన్‌తో సమావేశం నిర్వహించిన ప్రభుత్వ విప్ ఐలయ్య
- ఆయన నచ్చజెప్పడంతో వెనక్కి తగ్గిన డైరెక్టర్లు



సాక్షి,యాదాద్రి: మదర్ డెయిరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డిపై అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధమైన సొంత పార్టీకి చెందిన డైరెక్టర్లతో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సమావేశం కావడంతో వారు కాస్త మెత్తబడ్డారు. చైర్మన్‌ను మార్చాలన్న 10 మంది కాంగ్రెస్ డైరెక్టర్లకు, ప్రతిపక్ష బీఆర్‌ఎస్‌కు చెందిన నలుగురు డైరెక్టర్లు కూడామద్దతు ప్రకటించారు. నేడో రేపో అవిశ్వాసం పెట్టే అవకాశం ఉన్న నేపథ్యంలో బుధవారం రాత్రి యాదగిరిగుట్టలో మదర్ డెయిరీ చైర్మన్, డైరెక్టర్లతో ప్రభుత్వ విప్ సుదీర్ఘ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇరువర్గాలు వారి వాదనలు గట్టిగా వినిపించారు. అనంతరం అవిశ్వాసం ఆలోచన విరమించుకోవాలని ప్రభుత్వ విప్ డైరెక్టర్లను కోరగా.. వారు కొంత వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది.

- చైర్మన్‌గా గెలిచిన నాటి నుంచి మధుసూదన్‌రెడ్డి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఈ సమావేశంలో డైరెక్టర్లు ఆరోపించారు. ప్రైవేట్ పాల కొనుగోలులో చైర్మన్ కమీషన్లు తీసుకుంటున్నాడని, ఉద్యోగులను ఏకపక్షంగా బదిలీ చేశారని, పాల బిల్లులు, ఉద్యోగుల జీతాలు చెల్లించడంలో జాప్యం చేస్తున్నాడని డైరెక్టర్లు వివరించారు. తమలో ఒకరికి అవకాశం ఇస్తే డెయిరీని లాభాల బాట పట్టిస్తామని, అందుకే అవిశ్వాసం పెట్టామని పేర్కొన్నారు.
- అయితే మాజీ చైర్మన్‌ల డైరెక్షన్‌లో డైరెక్టర్లంతా కలిసి తనపై కుట్ర చేస్తున్నారని చైర్మన్ మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. గత పాలకవర్గంలో కొందరు డైరెక్టర్లు చిల్లింగ్ సెంటర్లలో అక్రమాలకు పాల్పడగా.. వాటిని తాను చైర్మన్ అయిన తర్వాత బట్టబయలు చేయడం కొందరికి నచ్చడంలేదని పేర్కొన్నారు. డెయిరీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రోజు లక్ష లీటర్ల పాల అమ్మకాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇందుకోసం ప్రైవేట్‌గా రోజు 40వేల లీటర్ల పాలు కొనక తప్పడంలేదని, డైరక్టర్లనే పాలు సరఫరా చేయాలని కోరినా ఎవరూ స్పందించడంలేదని వివరించారు. ప్రతినెలా జీతాలు, పాత బాకీలకు వడ్డీలు, నిర్వహణ ఖర్చులకే రూ.3 కోట్లు అవసరమవుతాయని చైర్మన్‌పేర్కొన్నారు.

కాంగ్రెస్ అధిష్టానం దిద్దుబాటు చర్యలు..

మదర్ డెయిరీ పాలకవర్గం ఏర్పడి ఆరు నెలలు కావొస్తుంది. మొత్తం 15 మంది డైరెక్టర్లలో 11 మంది కాంగ్రెస్, నలుగురు బీఆర్‌ఎస్ డైరెక్టర్లు ఉన్నారు. వీరిలో చైర్మన్ గాక అధికార పార్టీకి చెందిన మిగతా పది మంది అవిశ్వాసానికి సిద్ధమయ్యారు. వీరికి నలుగురు బీఆర్‌ఎస్ డైరెక్టర్లు మద్దతు ఇస్తామన్నారు. దీంతో అవిశ్వాసం తప్పదన్న చర్చ ప్రారంభమైంది. దీంతో కాంగ్రెస్ అధిష్టానం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యను రంగంలోకి దింపగా.. తాత్కాలికంగా అవిశ్వాసంపై వెనక్కి తగ్గినట్లు ఓ డైరెక్టర్ సాక్షితో చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికలు, మదర్ డెయిరీ ఎన్నికల జరిగిన తర్వాత మరోసారి అవిశ్వాసంపై ఆలోచన చేస్తామని ఆయన పేర్కొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొని ఇద్దరు యువకులు దుర్మరణం

- బైక్‌పై వెళ్తూ ఢీకొని ఒకరు..
- పోలీసులు ట్రాక్టర్‌ను పక్కకు తీసుండగా మరో యువకుడు ..



కిరణ్ (ఫైల్)



శేఖర్ (ఫైల్)

కనగల్: బైక్‌లపై వెళ్తున్న ఇద్దరు యువకులు రోడ్డుపై ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొని మృతిచెందారు. ఈ ఘటన కనగల్ మండలం బాబాసాహెబ్‌గూడెం గ్రామ స్టేజీ వద్ద బుధవారం రాత్రి జరిగింది. గురువారం ఎస్‌ఐ విష్ణుమూర్తి తెలిపిన వివరాల ప్రకారం .. అనుముల మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన రైతు సింగం కొండల్ ట్రాక్టర్‌లో బుధవారం వడ్ల లోడుతో కనగల్ మండలం శేరిలింగోటంలోని ఐకేపీ కేంద్రానికి వస్తుండగా.. బాబాసాహెబ్‌గూడెం గ్రామ స్టేజీ వద్ద టైరు పంక్చర్ కావడంతో ట్రాక్టర్ ట్రాలీని రోడ్డుపై నిలిపి ఉంచాడు. బుధవారం రాత్రి అనుముల మండలం శ్రీనాథపురం గ్రామ పంచాయతీ పరిధిలోని బంటువారిగూడేనికి చెందిన చింతకాయల కిరణ్(33), గుర్రంపోడు మండలం పల్లిపహాడ్ గ్రామానికి చెందిన జనికల అఖిల్ కలిసి బైక్‌పై నల్లగొండ వైపు వస్తూ బాబాసాహెబ్‌గూడెం గ్రామ స్టేజీ వద్ద ట్రాక్టర్‌ను గమనించకుండా దానిని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ కిరణ్ మృతిచెందాడు. అఖిల్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. మృతుడు కిరణ్‌కు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కిరణ్ వరికోత మిషన్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ ప్రమాదం జరిగిన మూడు గంటల తర్వాత ట్రాక్టర్ ట్రాలీని పోలీసులు రోడ్డు పక్కకు తీయిస్తుండగా.. మిర్యాలగూడలోని చెన్నై షాపింగ్ మాల్‌లో పనిచేస్తున్న గుర్రంపోడు మండలం కొప్పోలు గ్రామానికి చెందిన బల్గూరి శేఖర్(35) స్వగ్రామానికి బైక్‌పై వెళ్తూ ట్రాక్టర్ ట్రాలీని ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. కిరణ్ తమ్ముడు సంతోష్, శేఖర్ భార్య కవిత ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ ట్రాలీని రోడ్డుపై నిర్లక్ష్యంగా వదిలి వెళ్లిన సింగం కొండల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సెల్‌ఫోన్లు చోరీ చేస్తున్న దొంగల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్

చివ్వెంల(సూర్యాపేట): సెల్‌ఫోన్లు చోరీ చేస్తున్న ముగ్గురు దొంగలను గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు జిల్లాకు చెందిన పసుపులేటి రాజు, అనంతపురం జిల్లాలోని గుంతకల్లుకు చెందిన కొమ్మూరి ఆదినారాయణ, హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌కు చెందిన కావడి సామేల్, ఒరిస్సా రాష్ట్రానికి చెందిన సురేష్ ప్రధాన్ ముఠాగా ఏర్పడి సెల్‌ఫోన్లు చోరీ చేసి ఫోన్ పే, గూగుల్ పే ద్వారా నగదు కాజేసి జల్సాలు చేస్తున్నారు. గురువారం చివ్వెంల మండలం వట్టిఖమ్మంపహాడ్ గ్రామ శివారులోని ఫ్లైఓవర్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా.. నలుగురు కలిసి రెండు కార్లలో వస్తూ పట్టుబడ్డారు. వీరిలో పసులేటి రాజు పరారైనట్లు సీఐ తెలిపారు. మిగతా ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. వారి నుంచి రూ.3.50 లక్షలు, రెండు కార్లు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ప్రధాన నిందితుడైన పసుపులేటి రాజు మిగతా ముగ్గురికి రూ.లక్ష, రూ.50 వేలు. రూ.70 వేలు చొప్పున ఇస్తూ కార్లలో తిప్పుతూ సెల్‌ఫోన్లు చోరీ చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు. వీరు నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం ఎర్రబెల్లి గ్రామానికి చెందిన బొబ్బ వెంకట్‌రెడ్డి సెల్‌ఫోన్ అపహరించి రూ.99వేలు, శాలిగౌరారం మండలం పెర్కకొండారం గ్రామానికి కల్లెట్లపల్లివీరయ్య సెల్‌ఫోన్ అపహరించి రూ.54వేలు, తుంగతుర్తి మండలం కర్విరాల కొత్తగూడెం గ్రామానికి చెందిన గొల్లపల్లి రమేష్ ఫోన్ అపహరించి రూ.80వేలు కాజేశారు. అంతేకాకుండా సూర్యాపేట పట్టణంలోని కొత్త బస్టాండ్‌లో ఇద్దరు వ్యక్తుల నుంచి ఫోన్లు అపహరించి రూ.2.45లక్షలు కాజేసి అందులో రూ.1.30 లక్షలు ఖర్చు చేశారని, అదేవిధంగా దురాజ్‌పల్లి జాతరలో మూడు సెల్‌ఫోన్లు అపహరించినట్లు సీఐ పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

గట్టుప్పల్: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని గురువారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ గుత్తా వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సంస్థాన్ నారాయణపురం మండలంం డాకు తండాకు చెందిన దశరథ గట్టుప్పల్ మండలంలో రేషన్ లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యం కొనుగోలు చేసి అంతంపేటలోని ఓ ఇంట్లో భద్రపరిచాడు. ఈ బియ్యాన్ని గురువారం బొలెరో వాహనంలో గట్టుప్పల్ మీదుగా సంస్థాన్ నారాయణపురంలోని కోళ్ల ఫాంకు తరలిస్తుండగా.. విజిలెన్స్ అధికారుల సమాచారం మేరకు గట్టుప్పల్ పోలీసులు పట్టుకున్నారు. సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ సైదులు 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఎంఎల్‌ఎస్ పాయింట్‌లో భద్రపరిచారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



శ్రీనివాస్ (ఫైల్)

చిట్యాల: చిట్యాల పట్టణంలోని గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. నార్కట్‌పల్లికి చెందిన బొశెట్టి శ్రీనివాస్ అలియాస్ వెంకన్న (58) చిట్యాల పట్టణంలోని భువనగిరి రోడ్డులో గల రైస్ మిల్లులో గుమాస్తాగా పనిచేస్తున్నాడు. గురువారం నార్కట్‌పల్లి నుంచి బైక్‌పై వెళ్తుండగా.. చిట్యాల పట్టణ సమీపంలోని బాలనర్సింహస్వామి ఆలయం వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

బీబీనగర్‌లో రాకెట్ సామగ్రి తయారీ

బీబీనగర్: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) త్వరలో ప్రయోగించనున్న జీఎస్‌ఎల్వీ రాకెట్‌లో వినియోగించే ఎకోథెర్మ్ ఫినోలిక్ ఫోం ప్యాడ్‌ల తయారీ బీబీనగర్ మండలంలో జరిగింది. మండల పరిధిలోని జమీలాపేట గ్రామ శివారులో గల వీఎస్‌డీ సెల్ ప్లాస్ట్ పరిశ్రమలో 365 ఎకోథెర్మ్ ఫినోలిక్ ఫోం ప్యాడ్‌లను తయారు చేశారు. రాకెట్‌లో వినియోగించనున్న వీటిని పరిశ్రమ యాజమాన్యం ఇస్రో సంస్థతో ఒప్పందం చేసుకొని తయారు చేసినట్లు సమాచారం. ప్యాడ్‌ల తయారీ పూర్తికావడంతో వాటిని పరిశ్రమ నుంచి తిరువనంతపురంలోని విక్రమ్ సారాబాయ్ స్పేస్ సెంటర్‌కు కంటైనర్ల ద్వారా తరలించారు.

మిర్యాలగూడ పట్టణంలో కార్డన్ సెర్చ్

- సరైన పత్రాలు లేని 60 వాహనాలు సీజ్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ రాజశేఖర రాజు



పట్టుబడిన వాహనాలను చూపుతున్న పోలీసులు

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలోని గాంధీనగర్‌లో గురువారం తెల్లవారుజామున 4గంటల నుంచి పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పోలీసులు బృందాలుగా విడిపోయి సోదాలు చేశారు. అనంతరం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రాజశేఖర రాజు కార్డన్ సెర్చ్ వివరాలు వెల్లడించారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో చేపట్టిన కార్డన్ సెర్చ్‌లో భాగంగా పలువురు అనుమానిత వ్యక్తులను గుర్తించినట్లు డీఎస్పీ తెలిపారు. అదేవిధంగా 56 ద్విచక్ర వాహనాలు, నాలుగు ఆటోలను సీజ్ చేసినట్లు తెలిపారు. వీటిలో నంబర్ ప్లేట్ లేని 12 ద్విచక్ర వాహనాలు ఉండగా నాలుగు ఆటోలకు సరైన ధ్రువపత్రాలు లేనట్లు గుర్తించామన్నారు. పలు వాహనాల నంబర్లు ట్యాంపరింగ్ చేసినట్లు గుర్తించామని, ఈ వాహనాలు ఎక్కడి నుంచి వచ్చాయి..? ఏదైనా నేరాలకు పాల్పడ్డారా..? అనే కోణంలో విచారణ చేస్తున్నామని తెలిపారు. మిర్యాలగూడ సబ్ డివిజన్ పరిధిలో కార్డన్ సెర్చ్ నిరంతరం కొనసాగుతుందని, అనుమానిత వ్యక్తులు ఎవరైనా సంచరిస్తున్నట్లు అనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, రోడ్లపై అతివేగంగా డ్రైవింగ్ చేస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్డన్ సెర్చ్‌లో సీఐలు పీఎన్‌డీ ప్రసాద్, సోమనర్సయ్య, మోతీరాంతో పాటు 12మంది ఎస్‌ఐలు, 75మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు.

స్వర్ణగిరీశుడికి తిరుప్పావడ సేవ



తిరుప్పావడ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి: భువనగిరి పట్టణ శివారులోని స్వర్ణగిరి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో గురువారం స్వామి వారికి తిరుప్పావడ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 450 కిలోల అన్నప్రసాదంతో పాటు లడ్డూలు, వడలు స్వామి వారికి నైవేద్యంగా సమర్పించారు. అంతకుముందు ఆలయంలో ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, తోమాల సేవ, సహస్రనామార్చన, నిత్య కల్యాణం , సాయంత్రం మాడ వీధుల్లో తిరువీధి సేవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

భర్త వేధింపులు భరించలేక భార్య ఆత్మహత్య

- గడ్డి మందు తాగి భర్త కూడా ఆత్మహత్యాయత్నం



కావ్య (ఫైల్)

రామన్నపేట: భర్త వేధింపులు భరించలేక భార్య ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. భార్య ఆత్మహత్య చేసుకున్న విషయం తెలుసుకున్న భర్త కూడా గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన గురువారం రామన్నపేట మండలం నిధానపల్లి గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల పట్టణానికి చెందిన బొబ్బిలి మల్లయ్య కుమార్తె కావ్య(25)ను 2018లో రామన్నపేట మండలం నిధానపల్లి గ్రామానికి చెందిన జినుకల ఆంజనేయులుకు ఇచ్చి వివాహం చేశారు. వారికి ఆరేళ్ల లోపు వయస్సున్న ఇద్దరు కుమారులు ఉన్నారు. వారం క్రితం అదనపు కట్నం విషయంలో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో ఈ నెల 8వ తేదీన కావ్యపై భర్త ఆంజనేయులు చేయి చేసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. బయటకు వెళ్లిన భర్త ఇంటికి తిరిగి రాకపోవడంతో మానసిన వేదనకు గురైన కావ్య గురువారం ఉదయం తమ వ్యవసాయబావి వద్ద పశువుల కొట్టంలో ఇనుప రాడ్డుకు చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కావ్య ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిన ఆమె భర్త ఆంజనేయులు వలిగొండ సమీపంలో గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. అతడికి రామన్నపేట ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించి హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తండ్రి మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పి. మల్లయ్య తెలిపారు.

కారు ఢీకొని మహిళ మృతి



వర్షంలో రాస్తారోకో నిర్వహిస్తున్న మృతురాలి బంధువులు

మోటకొండూర్: రోడ్డు దాటుతున్న మహిళను కారుతో ఢీకొనడంతో మృతిచెందింది. ఈ ఘటన మోటకొండూర్ మండలం కొండాపురం గ్రామంలో బుధవారం రాత్రి జరిగింది. గురువారం ఎస్‌ఐ నాగుల ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపురం గ్రామానికి చెందిన గుడేటి నర్సమ్మ(60) బుధవారం రాత్రి గ్రామ పరిధిలో రోడ్డు దాటుతుండగా మోత్కూర్ నుంచి భువనగిరి వైపు కారులో అతివేగంగా వెళ్తున్న ఎర్రగుంట సూరజ్ ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గుడేటి నర్సమ్మ అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలి కుమారుడు గుడేటి యాదయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మృతురాలి బంధువుల రాస్తారోకో..

గుడేటి నర్సమ్మ కుటుంబానికి న్యాయం చేయాలని కొండాపురం గ్రామంలోని మోత్కూర్–రాయిగిరి రహదారిపై గురువారం సాయంత్రం మృతురాలి బంధువులు రాస్తారోకో నిర్వహించారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా ప్రమాదానికి కారకులైన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని ఆరోపించారు. రోడ్డుపై వాహనాలు పెద్దఎత్తున నిలిచిపోవడంతో ఏసీపీ రమేష్ ఘటనా స్థలానికి చేరుకుని మృతురాలి బంధువులకు సర్దిచెప్పి రాస్తారోకోను విరమింపజేశారు.

హక్కులను కాలరాసే కుట్ర చేస్తున్న బీజేపీ

- వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వీరయ్య



నాయకుల చేత ప్రమాణం చేయిస్తున్న వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వీరయ్య

కోదాడ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల హక్కులను కాలరాసే కుట్ర చేస్తోందని తెలంగాణ రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం కోదాడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ‘జై బాపు– జై భీమ్– జై సంవిధాన్’ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని దాని కోసమే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తల చేత ఆయన ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవేటి రామారావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎస్‌కె. బషీర్, వరప్రసాదరెడ్డి, సామినేని ప్రమీల, కందుల కోటేశ్వరరావు, షాబుద్దీన్, కాంపాటి శ్రీను, సైదిబాబు, కట్టెబోయిన శ్రీను, కోల్లా కోటిరెడ్డి పెండెం వెంకటేశ్వర్లు, రాజు, డాక్టర్ బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలం పంపిణీపై అన్నదమ్ముల మధ్య ఘర్షణ

- ఇద్దరికి గాయాలు
- ఫిర్యాదు చేసేందుకు వెళ్తే పోలీసులు కొట్టారని బాధితుడి ఆరోపణ

శాలిగౌరారం: ఇంటి స్థలం పంపిణీలో అన్నదమ్ముల కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన శాలిగౌరారం మండలం ఎన్‌జి కొత్తపల్లి గ్రామంలో గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎన్‌జి కొత్తపల్లి గ్రామానికి చెందిన రాపోలు మారయ్య, బాలయ్య, శ్రీను, సాలయ్య సొంత అన్నదమ్ములు. వీరికి గ్రామంలో నాలుగు గుంటల ఇంటి స్థలం ఉంది. ఈ స్థలాన్ని రెండేళ్ల కిత్రం సమానంగా పంచుకున్నారు. దీంతో బాలయ్య, శ్రీను వారికి వచ్చిన స్థలంలో పక్కా ఇళ్లు నిర్మించుకున్నారు. అవివాహితుడైన సాలయ్య తనకిచ్చిన స్థలంలోని పూరిల్లును తొలగించి రేకుల ఇంటిని నిర్మించుకునేందుకు సిద్ధమవుతున్నాడు. ఈ క్రమంలో మారయ్య కుమారులు అంజి, పరుశరాములు తమ వాటాకు తక్కువ స్థలం ఉందని మరోమారు స్థలాలను సమానంగా పంపిణీ చేయాలని గ్రామ పెద్దల సమక్షంలో నెల రోజుల క్రితం పంచాయితీ పెట్టారు. బాలయ్య, సాలయ్య పక్కా ఇళ్లు నిర్మించుకోవడంతో తిరిగి స్థలం పంపిణీ చేయడం సరికాదని.. గతంలో పంపిణీ చేసుకున్న విధంగా ఉండాలని గ్రామ పెద్దలు మారయ్య కుమారులకు సర్దిచెప్పారు. ఈ నెల 8న సాలయ్య పూరిల్లును మారయ్య కుమారుడు అంజి తొలగించాడు. దీంతో నలుగురు అన్నదమ్ముల మధ్య గొడవ జరిగింది. ఈ గొడవలో అంజి రాయితో దాడి చేయడంతో శ్రీను కుమారుడు చందు తలకు తీవ్ర గాయమైంది. దీంతో కోపోద్రిక్తులైన శ్రీను, సాలయ్య తన అన్న కుమారుడైన పరుశరాములుపై దాడిచేశాడు. ఈ దాడిలో పరుశరాములు తలకు గాయమైంది. చందును నార్కట్‌పల్లిలోని కామినేని హాస్పిటల్‌కు, పరుశరాములును నకిరేకల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం అంజి తన తమ్ముడు పరుశరాములును తీసుకొని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లాడు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన తనను ఎస్‌ఐతో పాటు మరో ముగ్గురు కానిస్టేబుళ్లు తీవ్రంగా కొట్టారని అంజి ఆరోపిస్తున్నాడు. ఈ విషయంపై ఎస్‌ఐ సైదులును వివరణ కోరగా.. ఇంటి స్థలం విషయంలో అన్నదమ్ములు ఘర్షణ పడడంతో ఇద్దరికి గాయాలయ్యాయని, ఇరువర్గాలు ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకోవడంతో కేసులు నమోదు చేశామన్నారు. అంజి కూడా ఘర్షణలో పాలుపంచుకోవడంతో అతడి కాళ్లు, చేతులకు గాయాలయ్యాయని, అతడిని తాను గాని, కానిస్టేబుళ్లు కొట్టలేదని ఎస్‌ఐ తెలిపారు. కావాలనే అంజి పోలీసులపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఎస్‌ఐ వివరించారు.


డ్రిప్‌ల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు



పామాయిల్ తోటలో ఏర్పాటు చేసుకున్న డ్రిప్ సిస్టం

నడిగూడెం: రాయితీపై తీసుకున్న సూక్ష్మ సేద్యపు పరికరాలు(డ్రిప్, స్ప్రింక్లర్లు) రెండోసారి తీసుకోవాలంటే ఏడేళ్లు ఆగాలని, అంతవరకు వాటిని జాగ్రత్తగా వాడుకోవాలని హార్టికల్చర్ కన్సల్టెంట్ సుందరి సురేష్‌కుమార్ అన్నారు. ప్రస్తుత వేసవిలో ఉద్యానవన పంటల సాగుకు నీరు చాలా అవసరమని, ఇలాంటి సమయంలో డ్రిప్ పరికరాలను జాగ్రత్తగా ఉపయోగించుకోవాలని చెబుతున్నారు.

- ఒకసారి పొలంలో అమర్చుకున్న డ్రిప్ పరికరాలను రైతులు జాగ్రత్తగా వాడుకోవాలి. వాటి పనితీరు, చిన్నపాటి మరమ్మతుల గురించి అవగాహన కలిగి ఉండాలి. డ్రిప్ సిస్టమ్ హెడ్ కంట్రోల్ యూనిట్‌లో వివిధ రకాల ఫిల్టర్లు నీటిలోని ఇసుక, ఆల్గే(నాచు) చెత్త, మలినాలు వేరు చేసేందుకు అమర్చబడి ఉంటాయి. అవి మూసుకుపోకుండా ఫిల్టర్లను తరచూ శుభ్రం చేసుకోవాలి. అందులో ఇసుక ఫిల్టర్‌ను బ్యాక్‌వాష్ పద్ధతిలో శుభ్రం చేసుకోవాలంటే అందులో ఉండే నాలుగు వాల్వ్‌ల గురించి తెలుసుకోవాలి. సిస్టమ్ నడుస్తున్నప్పుడు 2, 4 నంబర్ వాల్వులు తెరిచి 1, 3 నంబర్ వాల్వులు పూర్తిగా మూసివేసి నీటిని పంపడం ద్వారా ఇసుక బెడ్ శుభ్రపడతాయి. రెండో పద్ధతిలో ఇసుక బెడ్‌లోని ఖాళీలు మూసుకుపోయినప్పుడు ముందుగా 1, 3 నంబర్ వాల్వులు తెరిచి 2, 4 నంబర్ వాల్వులు మూసేసి నీటిని నింపడం ద్వారా అందులో మలినాలు 1వ నంబర్ వాల్వ్ ద్వారా బయటకు పోయి ఇసుక బెడ్ శుభ్రమవుతుంది. ఈ పద్ధతిని శాండ్ ఫిల్టర్ అమర్చిన రెండు ప్రెషర్ గేజ్‌లను మధ్య తేడా 0.5 కిలో లేదా 0.5.సెం.మీ కన్నా ఎక్కువ పెరుగుతున్నప్పుడు శుభ్రం చేసుకోవాలి. ఫిల్టర్ ఇసుక ఉండాల్సిన మట్టానికి తక్కువైనప్పుడు తిరిగి మట్టానికి ఇసుక నింపుకోవాలి. బ్యాక్ వాష్ చేసే ముందు శ్యాండ్ ఫిల్టర్ మూత తెరిచి చేతులతో ఇసుక బెడ్‌ను కలియబెట్టాలి. ఇలా చేయడం వలన ఫిల్టర్‌ను తొందరగా శుభ్రం చేసుకోవచ్చు.



స్క్రీన్ ఫిల్టర్ శుభ్రం ఇలా..

సిస్టం నడుస్తుండగా స్క్రీన్ ఫిల్టర్‌ను శుభ్రం చేసుకోవాలంటే ఫిల్టర్ కింది భాగంలో అమర్చిన డ్రైన్ వాల్వ్‌ను తెరిస్తే స్క్రీన్ మెష్‌పై ఉన్న మలినాలు ఈ వాల్వ్ ద్వారా బయటకుపోతాయి. చాలాసార్లు మలినాలు ఫిల్టర్ మెష్‌పై పేరుకుపోయి మెష్‌పైనే అంటుకొని ఉంటాయి. అలాంటప్పుడు పంప్ ఆఫ్ చేసి ఫిల్టర్ మూతను తెరిచి ఫిల్టర్‌లోని మెష్‌ను బయటకు తీసి పేరుకపోయిన మలినాలను సున్నితమైన ప్లాస్టిక్ బ్రష్ లేదా చేతివేళ్లతో శుభ్రం చేయాలి. (మెష్ చిరిగిపోకుండా జాగ్రత్త తీసుకోవాలి) స్క్రీన్ ఫిల్టర్‌లో మెష్ లేకుండా నడపకూడదు. పేడ, ఇతర సేంద్రియ ఎరువులను డ్రిప్ ద్వారా పంపకూడదు. దీని వల్ల ఫిల్టర్లు, డ్రిప్పర్లు మూసుకపోతాయి. ఇక పీవీసీ పైపులు, లేటరల్ పైపులు శుభ్రం చేసుకొనేందుకు ఎండ్ క్యాప్ లేదా ఎండ్ ప్లగ్ ప్రతివారం లేదా కనీసం 15 రోజులకోసారి తెరచి నీటిని పూర్తి ప్రెషర్‌తో లోపలికి పంపితే ఎండ్ ప్లగ్ చివర్ల ద్వారా మలినాలు బయటకు కొట్టుకపోతాయి. మూడు నెలలకొకసారి లేదంటే కనీసం ఆరు నెలలకు ఒకసారి కచ్చితంగా యాసిడ్ ట్రీట్‌మెంట్ ద్వారా డ్రిప్ యూనిట్‌ను శుభ్రం చేసుకోవాలి. యాసిడ్ ట్రీట్‌మెంట్ చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

అప్పుల బాధతో రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆత్మహత్య

చివ్వెంల(సూర్యాపేట): అప్పుల బాధతో రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన చివ్వెంల మండలం కుడకుడ గ్రామంలో బుధవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుడకుడ గ్రామానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి రత్నావత్ రవి(41)వ్యాపారంలో నష్టపోయి అప్పులపాలయ్యాడు. దీంతో బుధవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి భార్య విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వి. మహేశ్వర్ కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట జనరల్ హాస్పిటల్‌కు తరలించారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.